స్వచ్ఛ మేడారం కోసం..

మహాజాతరలో పారిశుధ్య పరిరక్షణకు సిద్ధమవుతున్న యంత్రాంగం

- 10 జోన్లుగా మేడారం విభజన
- 4వేల మంది స్కావెంజర్లతో వ్యర్థాల ఏరివేత
- రాజమండ్రి, తెనాలి, విజయవాడ నుంచి కార్మికులు
- పర్యవేక్షణకు 1,072 మంది అధికారులు
- 10 డంపింగ్ యార్డులు సిద్ధం
- రోడ్లను ఊడ్చేందుకు ఐదు స్వీపింగ్ మిషన్లు



జాతరలో పారిశుధ్య పనులు చేసేందుకు వచ్చిన రాజమండ్రి, తెనాలికి చెందిన కార్మికులు (ఫైల్)

ములుగు, ఫిబ్రవరి 3: కోటిన్నర మంది భక్తులు తరలివచ్చే మేడారం మహాజాతరను పరిశుభ్రంగా, స్వచ్ఛంగా జరిపించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పారిశుధ్య పరిరక్షణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుంది. వెయ్యి మంది అధికారుల పర్యవేక్షణలో 4వేల మందికి పైగా పారిశుధ్య కార్మికులతో 24 గంటలు క్లీనింగ్ పనులు చేయాలని నిర్ణయించింది.

10 జోన్లు.. 25 సెక్టార్లు

మేడారం జాతర జరిగే ప్రదేశం, భక్తులు విడిది చేసే ప్రాంతాలను కలుపుకొని ఏడు కిలోమీటర్ల విస్తీర్ణంలో పారిశుధ్య చర్యలకు అధికారులు నిర్ణయించారు. 10 జోన్లు, 25 సెక్టార్లు, 60 సబ్ సెక్టార్లుగా విభజించారు. జోన్‌కు డీఎల్‌పీవో, సెక్టార్‌కు ఎంపీవో, సబ్ సెక్టార్లకు పంచాయతీ కార్యదర్శులను పర్యవేక్షక అధికారులుగా నియమించారు. డీపీవో ఆధ్వర్యంలో మొత్తం 1,072 మంది ఆయా కేడర్‌ల అధికారులు, సిబ్బందికి జాతర నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నారు.

4వేల మందితో వ్యర్థాల ఏరివేత

జాతరలో పారిశుధ్య పనుల కోసం 4వేల మంది కార్మికులను వినియోగించనున్నారు. ఎప్పటిలాగే రాజమండ్రి, విజయవాడ, తెనాలి ప్రాంతాల నుంచి కార్మికులను రప్పిస్తున్నారు. మరుగుదొడ్ల క్లీనింగ్ కోసం ప్రత్యేకంగా 1200 మందిని నియమిస్తున్నారు. జోరు జాతర జరిగే వారం రోజులలో 8 గంటలకో షిఫ్టు చొప్పున మూడు షిఫ్టులలో 24 గంటల పాటు పారిశుధ్య పనులు చేయనున్నారు. మిగతా రోజుల్లో రెండు షిఫ్టులలో పనులు చేస్తారు. ప్రస్తుతం 380 మందితో పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు. క్రమంగా వీరి సంఖ్యను పెంచనున్నారు.

10 చోట్ల భారీ డంపింగ్ యార్డులు

సేకరించిన చెత్తను జాతరకు దూరంగా తరలించేందుకు 10 చోట్ల డంపింగ్ యార్డులను గుర్తించడం జరిగింది. గుడ్డేలుగు గుట్ట, కొంగల మడుగు-1, 2, చింతల్ క్రాస్-1, 2, కన్నెపల్లి, ఊరట్టం, కొండాయి-1, 2 డంపింగ్ యార్డులను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్లాస్టిక్, తడి, పొడి, మాంసం వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించనున్నారు. ఇందుకోసం ట్రాక్టర్లు, మినీ డంపర్లను సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు 5 స్వీపింగ్ యంత్రాలను సమకూర్చుకుంటున్నారు.

బ్లీచింగ్, సున్నం డంప్

జాతర జరుగుతున్న సమయం, అనంతరం బ్యాక్టీరియా వ్యాపించకుండా యాంటీ లార్వా ద్రావకాన్ని పిచికారీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. దీనికోసం బ్లీచింగ్ పౌడర్, సున్నం, కెమికల్ ద్రావకాలను దిగుమతి చేసుకుంటున్నారు. 2,500 బస్తాల చొప్పున బ్లీచింగ్, సున్నం బస్తాలు, తడి, పొడి చెత్త సేకరణ కోసం 25వేల చొప్పున కవర్లు తెప్పిస్తున్నారు. వ్యర్థాలను తొలగించిన తర్వాత దుర్గంధం వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు వీటిని పరిసరాలలో చల్లుతారు.



మేడారంలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

6వేల తాత్కాలిక మరుగుదొడ్లు

జాతర పరిసరాల్లో మొత్తం 279 బ్లాక్‌లలో 6వేల తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే శాశ్వత ప్రాతిపదికన 12 బ్లాక్‌లలో 25 చొప్పున నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఒక్కో కార్మికునికి ఐదు మరుగుదొడ్ల బాధ్యతను అప్పగించి ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. నిరంతరం నీటి సరఫరా జరిగేలా పైప్‌లైన్‌లను విస్తరించి నీటి తొట్లను నిర్మిస్తున్నారు.



మేడారం పరిసరాలలో నిర్మిస్తున్న తాత్కాలిక మరుగుదొడ్లు

భక్తులు సహకారం అందించాలి

- కె.వెంకయ్య, ములుగు డీపీవో



మేడారం జాతరను కాలుష్య రహితంగా జరిపించేందుకు భక్తులు సహకారం అందించాలి. అడవి మధ్యలో కొలువైన వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. సిబ్బందికి సహకరించాలి. జాతర పరిసరాలలో ఏర్పాటుచేసే మినీ డంపింగ్ సెంటర్లు, చెత్త కుండీలలోనే వ్యర్థాలను వేయాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు విక్రయించవద్దని ఇప్పటికే స్థానికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులకు నోటీసులు జారీ చేశాం. అవగాహన కల్పిస్తున్నాం. పెద్ద ఎత్తున జూట్ బ్యాగులను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నాం.

జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

మేడారంలో మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ తరుణ్ జోషి

మేడారం, ఫిబ్రవరి 3 : మేడారం మహా జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి అన్నారు. శనివారం మేడారం పోలీసు స్టేషన్ పరిధిలోని షెడ్డులో పోలీసు నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ గత జాతరలో ట్రాఫిక్ విభాగానికి ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. జాతరలో ట్రాఫిక్ నిర్వహణ ముఖ్యమైనదని అధికారులు గుర్తుంచుకోవాలని అన్నారు. రోడ్డుపై వాహనం ఆగిందంటే ట్రాఫిక్ రద్దీ లేదా ట్రాఫిక్ జామ్‌కు కారణమని సూచించారు. అందుకు పోలీసు అధికారులు దారి పొడవునా ద్విచక్ర వాహనాలతో రూట్ పెట్రోలింగ్ నిర్వహిచాలని సూచించారు. వాహనం ఎక్కడైనా నిలిచిపోతే పక్కకు లాగడానికి రెండు కిలోమీటర్ల ఒక ఎక్స్‌కావేటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల పట్ల సహనంగా ప్రేమతో స్పందించాలని అన్నారు.

జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జాతర పనులపై స్పష్టంగా వివరించారు. రిసెప్షన్ డ్యూటీలు, ట్రాఫిక్ నివారణ, రూట్ మొబైల్ పార్టీలు, ప్రతి నాలుగు కిలోమీటర్లకు పోలీసు ఔట్ పోస్టులను, సైన్ బోర్డులను, రద్దీ నివారణ, వీఐపీ, వీవీఐపీల భద్రత, సీసీ టీవీల పర్యవేక్షణ, మీడియా, వీఐపీ పాస్‌ల వంటి అంశాలపై సిబ్బందికి మార్గదర్శకాలను వివరించారు. అనంతరం ఐజీ నోడల్ అధికారులతో కలిసి వివిధ పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి తగు సూచనలు చేశారు. సమావేశంలో ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వనదేవతలకు ఐజీ ప్రత్యేక పూజలు

మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతలను మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దేవాదాయ శాఖ అధికారులు ఐజీకి స్వాగతం పలికి గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. ప్రసాదం అందజేసి కండువాతో సన్మానించారు. అదేవిధంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కుటుంబ సమేతంగా వనదేతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

మేడారంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం 20వేల మందికి పైగా భక్తులు వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు, గొర్రెలను బలిచ్చారు. మేడారం పరిసరాలలో విడిది చేసి బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు.

మేడారంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక చర్యలు

450 మంది అధికారులతో యాక్షన్ ప్లాన్

ములుగు, భూపాలపల్లి జిల్లాల ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 3 : తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనున్న దృష్ట్యా ఎక్సైజ్ శాఖ అనేక రకాల ప్రత్యేక చర్యలు తీసుకోబోతుందని ములుగు, భూపాలపల్లి జిల్లాల ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జాతరలో తమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరను ప్రశాంతమైన వాతావరణంలో జరిపించేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మేడారంలో ఒక కంట్రోల్ రూమ్, నార్లాపూర్ గ్రామంలో రెండు సబ్ కంట్రోల్ రూములను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా వివిధ జిల్లాల నుంచి మొత్తం సుమారు 450 మంది అధికారులు, సిబ్బంది జాతరలో విధుల్లో పాల్గొంటారని, వారితో యాక్షన్ ప్లాన్ చేయడం జరుగుతుందని తెలిపారు. జాతరలో ఎక్సైజ్ శాఖ నుంచి 6 తాత్కాలిక చెక్ పోస్టులు, 15 మొబైల్ పెట్రోలింగ్ పార్టీ వాహనాలతో పాటు ఎక్సైజ్ శాఖ ఇంటెలిజెన్స్ అధికారులతో టీంలను సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత డిసెంబరు నెల నుంచి ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో భాగంగా మేడారం చుట్టుపక్కల ఉన్న మండలాలతో పాటు తాడ్వాయి మండల వ్యాప్తంగా, ముఖ్యంగా మేడారం, జాతర పరిసర ప్రాంతాల్లో, చుట్టుపక్కల గ్రామాలలో తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. జాతర ప్రశాంతంగా సాగేందుకు ఎక్సైజ్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఎక్సైజ్ సీఐ ఫకీరా, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కామేశ్వరాలయం పునర్నిర్మాణానికి నిధులు

రూ.11 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం



కామేశ్వరాలయం (ఫైల్)

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 3 : వెంకటాపూర్ మండలంలోని రామప్ప రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లోని కామేశ్వరాలయ పునర్నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రూ.11 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర పురావస్తు శాఖ జిల్లా అధికారి మల్లేశం శనివారం తెలిపారు. రామప్ప ప్రధాన ఆలయంతో పాటు కామేశ్వరాలయానికి కూడా రామప్పలో ప్రత్యేక చోటు ఉంది. ఈ కామేశ్వరాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఢిల్లీ అధికారుల అనుమతితో కాకతీయులు నిర్మించిన సాండ్ బాక్స్ టెక్నాలజీతో తిరిగి యథావిధిగా నిర్మించనున్నారు. సుమారు ఆరు నెలల్లో ఫౌండేషన్ పూర్తిచేసి ఆతర్వాత ఆలయ శిలా ఫలకాలు గతంలో ఉన్న మాదిరిగా ఏర్పాటు చేయాలని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు యోచిస్తున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ అనుబంధ ఉప ఆలయాల అభివృద్ధి కోసం రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోళికేరి ఇటీవల రామప్పను సందర్శించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఉప ఆలయాల అభివృద్ధితో పాటు కామేశ్వరాలయం పునర్నిర్మాణం జరిగితే రామప్ప మరింత అభివృద్ధి చెంది పర్యాటకులను ఆకట్టుకోనుంది.

10వ తేదీలోగా మేడారం ఏర్పాట్లు పూర్తి

- భక్తులకు అందుబాటులోకి సదుపాయాలు
- పాత బిల్లులకు జాతర పనులను ముడిపెట్టొద్దు
- కాంట్రాక్టర్‌లకు రాష్ట్ర మంత్రి సీతక్క సూచన
- కొండాయి-ఊరట్టం రోడ్డుకు ఫారెస్టు క్లియరెన్స్‌కు చర్యలు తీసుకుంటామని వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

7లో

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

వీసీలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, రాబోయే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం ములుగులోని కలెక్టరేట్ నుంచి పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతీ గ్రామానికి ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. మళ్లీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు పాలన సాగించాలన్నారు. ప్రత్యేక అధికారులకు గ్రామంపై సంపూర్ణ బాధ్యత, హక్కులు ఉంటాయని, నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించుకుని గ్రామపంచాయతీ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈనెల 7నుంచి 15వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని, ఇందులో ప్రజలను, యువతను, మహిళలను భాగస్వామ్యం చేస్తూ గ్రామాలను అద్దంలా తయారు చేయాలని సూచించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చివరి రోజున గ్రామసభలు నిర్వహించి పారిశుధ్య కార్మికులను సన్మానించాలని మంత్రి సూచించారు.

మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో భక్తులు సైతం జాతరకు ప్లాస్టిక్ తీసుకురాకుండా అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిర్వహించే జాతరలో సైతం ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అధికారులు తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని, మిషన్ భగీరథ కార్యక్రమం కింద ప్రతి గ్రామానికి తాగునీరు బల్క్‌గా సరఫరా చేయాలని అన్నారు. తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.కోటి నిధులను కేటాయించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద అధిక మొత్తంలో కూలీలకు పని దొరికేలా చూడాలని, వర్కింగ్ సైట్‌లో ఉపాధి కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ నూతన పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ విధి నిర్వహణ, విధానాల వంటి అంశాలపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పిస్తూ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి కనెక్షన్లపై సర్వే నిర్వహించి ఇంకా నల్లా కనెక్షన్ లేని ఇళ్లను గుర్తించాలని, తాగునీటి సరఫరాకు సంబంధించి ఆర్థిక రఘం నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు. గురుకులాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంలు స్వయం ఉపాధి మహిళా సంఘాల ద్వారా కుట్టించాలని ప్రభుత్వం భావిస్తుందని, ఇందుకోసం జిల్లా స్థాయిలో అనుసరించాల్సిన విధానంపై ప్రణాళిక రూపొందించి సమర్పించాలన్నారు. పంచాయతీలో తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శి ఉండే విధంగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ బాధ్యతలు తీసుకున్న ప్రత్యేక అధికారులు నివేదికలు అందించాలని, ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ డైరెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డీఆర్‌డీవో నాగపద్మజ, జడ్పీ సీఈవో ప్రసూనరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

భూపాలపల్లి కలెక్టరేట్ : పకడ్బందీగా విధులు నిర్వర్తించి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ములుగు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, గ్రామాల ప్రత్యేక అధికారులతో మాట్లాడిన మంత్రి సీతక్క గ్రామాల్లో అధికారుల పాలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే వేసవిలో ఎట్టి పరిస్థితుల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారికి గ్రామంపై సంపూర్ణ బాధ్యతలు ఉంటాయన్నారు. సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో ఆశాలత, డీఆర్‌డీవో పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

'కాషాయ' తీర్థం పుచ్చుకున్న ఐదుగురు కౌన్సిలర్లు



నర్సంపేట నాయకులకు బీజేపీ కండువాను కప్పుతున్న కిషన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 3 : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డితోపాటు ఐదుగురు కౌన్సిలర్లతో సహా 55 మంది కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో శనివారం హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి 13మంది కౌన్సిలర్లు రాజీనామా చేసిన విషయం విదితమే. వీరంతా హైదరాబాద్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలిసి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు శీలం రాంబాబు, జుర్రరాజు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, నూనావత్ కవితవీరన్న, దుగ్గొండి మండలం మహ్మదాపురం సొసైటీ వైస్ చైర్మన్ పాలడుగుల జీవన్‌తో సహా 55మందికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఈటల రాజేందర్ సైతం వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, యువ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్‌గౌడ్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రాంచందర్ రెడ్డి, కోమాండ్ల సప్తగిరి, వనపర్తి మల్లయ్య పాల్గొన్నారు.

మారిన రాజకీయాలు

నర్సంపేట మునిసిపల్ చైర్ పర్సన్ గుంటి రజనిపై గతనెల 2న 13 మంది కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో అవిశ్వాస తీర్మానాన్ని అందజేయగా ఇదేనెల 30న స్థానిక మునిసిపాలిటీలో ప్రత్యేక అధికారి ఆర్డీవో కృష్ణవేణి, కమిషనర్ వెంకటస్వామిల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అవిశ్వాసం వీగిపోవడంతో భంగపాటుకు గురైన 13 మంది కౌన్సిలర్లు సర్వాపురంలో జరిపిన సమావేశంలో 13 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు మునిసిపల్ వైస్ చైర్మెన్ మునుగాల వెంకట్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ఈ13 మందిలో శనివారం పైన పేర్కొన్న ఐదుగురు కౌన్సిలర్లు బీజేపీ రారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన నాటి నుంచే రాజీకీయ పర్వం ఆరంభమై బీఆర్ఎస్ పార్టీ రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకొని ఉత్కంఠతకు దారి తీశాయి.

8 మంది కౌన్సిలర్ల రూట్ ఎటో..

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో ఐదుగురు బీజేపీలో చేరగా, మిగిలిన 8 మంది ఏ పార్టీలో చేరకుండా ఉంటారా? లేక వీరు కూడా బీజేపీలో చేరుతారా, మనసు మార్చుకొని తిరిగి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతారా అన్న ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. కౌన్సిలర్లు గత రెండు మూడు రోజులుగా తర్జనభర్జన పడుతున్నారు. వీరిలో ఒకరిద్దరు బీఆర్ఎస్ లోనే కొనసాగాలని భావిస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీకి దూరమైన కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ నేత అంగీకరించే అవకాశాలు లేవు. బీజేపీ తప్ప ఇతర పార్టీల్లో చేరే అవకాశాలు వారికి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఈ 8 మంది ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని స్థానికులతోపాటు బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నారు. 13 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇప్పటి వరకు వారి నిర్ణయంపై పెదవి విప్పలేదు.

బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ

నర్సంపేట బీఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే తాజాగా బీఆర్ఎస్‌కు ఇటీవల రాజీనామా చేసిన యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో 5గురు కౌన్సిలర్లతో సహా 55 మంది తాజాగా శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న బీజేపీలో చేరడం బీఆర్ఎస్ పార్టీకి గట్టిదెబ్బేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్టీసీ కారుణ్య నియామకాలకు మోక్షం

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ● లహరి ఏసీ సెమీ స్లీపర్ బస్సులకు ప్రారంభం



కారుణ్య నియామక పత్రం అందుకుంటూ విలపిస్తున్న స్వప్న

సుబేదారి, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం వల్లే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం కలిగిందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హనుమకొండలో బస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం 70 మందికి కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగాల నియామకపత్రాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యేలు, ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మరికొన్ని రోజుల్లోనే మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. 6 గ్యారంటీలను వంద శాతం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం నియామకాలను నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే 7వేల స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. మరికొన్ని రోజుల్లోనే 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, సీపీ అంబర్ కిశోర్ ఝా, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ ఆర్ఎంలు కే.భానుకిరణ్, మాధవరావుతోపాటు డిపోల మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులను ప్రారంభించిన మంత్రి

వరంగల్-1 డిపోకే కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులను వరంగల్-1 డిపో నుంచి బెంగళూరుకు నడపనున్నారు. ప్రయాణికులు ఈ బస్సులను వినియగించుకుని సౌకర్యంగా ప్రయాణం చేయాలన్నారు.

10లోగా మేడారం ఏర్పాట్లు పూర్తి

భక్తులకు అందుబాటులోకి సదుపాయాలు : కాంట్రాక్టర్‌లకు రాష్ట్ర మంత్రి సీతక్క సూచన



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 3: మేడారం మహాజాతర ఏర్పాట్లను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం తాడ్వాయి మండలం మేడారంలో పర్యటించిన మంత్రి పనులను పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అందుబాటులోకి వచ్చిన సదుపాయాలు, పూర్తికాని పనులపై చర్చించారు. శాఖల వారీగా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందించడం కోసం ప్రభుత్వం రూ.105 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా జాతర పనులను ఆలస్యంగా చేపట్టడం జరిగిందన్నారు. అయినప్పటికీ జాతరకు పది రోజుల ముందే సౌకర్యాలను వినియోగంలోకి తీసుకువస్తామని మంత్రి సీతక్క చెప్పారు. కొన్ని మట్టి రోడ్డు పనులు మిగిలి ఉన్నాయని, ఊరట్టం-కొండాయి రోడ్డు పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయని తెలిపారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడటం జరిగిందని, రోడ్డు పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని కొందరు కాంట్రాక్టర్లు జాతర పనులలో మొండికేసే ప్రయత్నం చేశారని, వారిని తప్పించి మరో కాంట్రాక్టర్‌తో పనులు చేయించామని తెలిపారు. పాత బిల్లులతో మేడారం పనులకు ముడిపెడితే ఊరుకునేది లేదన్నారు.

ప్లాస్టిక్ రహితంగా జాతర

ప్లాస్టిక్ రహితంగా జాతర నిర్వహించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నియంత్రణ నియమాలను పాటించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలన ర్యాలీలో పాల్గొన్నారు. చీపురుతో గద్దెల ప్రధాన ద్వారం ఎదుట రోడ్లను ఊడ్చారు.

ఓర్వలేకనే ఆరోపణలు

ఎంఎస్ఎంఈ స్కీం కింద రెండు మహిళా సంఘాలకు ఫుడ్ ట్రక్కులను పంపిణీ చేశారు. ఏటూరునాగారం మండలం ఎక్కెల గ్రామంలో సమ్మక్క, సారలమ్మ మహిళా గ్రూపు, గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన రాజరాజేశ్వర మహిళా సంఘానికి ఈ ట్రక్కులను జేడీఎం కొండల్‌రావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోరుతుందని, అందులో భాగంగానే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఓర్చుకోలేక కూలిపోతుందని తప్పుడు మాటలు మాట్లాడుతున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. టీఆర్ఎస్ పేరుతో ప్రజల్లోకి వచ్చిన కేసీఆర్ అధికార అహంకారంతో దేశ రాజకీయాలు చేస్తానని బీఆర్ఎస్‌గా పార్టీ పేరును మార్చడంతో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. ప్రియాంక గాంధీకి తెలంగాణలో తిరిగే అర్హత లేదని కేసీఆర్ బిడ్డ కవిత అనడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో ఏ మహిళను తిరగనివ్వకుండా కేసీఆర్ బిడ్డ ఒక్కతే తిరుగుతుందా..! అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించలేని దుస్థితి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఏపీవో వసంతరావు, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో చీపురుతో ఊడుస్తుతున్న మంత్రి సీతక్క

కబ్జాలు, అక్రమాలు, దోపిడీపై బీఆర్ఎస్ దృష్టి

నిధుల వినియోగంలో గత ప్రభుత్వం విఫలం ● తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తాం.. ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: వరంగల్ నగరాభివృద్ధికి వివిధ విభాగాల ద్వారా మంజూరైన నిధులను కూడా వినియోగించలేని దుస్థితిలో గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాలన చేశారని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. శనివారం హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ, కుడా పనులను సమీక్షించారు. అనంతరం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్ తదితర విభాగాల నిధులను నగరాభివృద్ధికి వినియోగించే సోయిలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రూ.3 కోట్ల తూర్పు నియోజకవర్గ అభివృద్ధి నిధులను ముట్టుకోలేదని దుయ్యబట్టారు. నాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎంత సేపు భూకబ్జాలు, ప్రజలను దోపిడీ చేయడం, భయపెట్టడం, అక్రమాలకు పాల్పడడంతోనే సరిపోయిందని ఆరోపించారు. అంతేకానీ నగరాభివృద్ధిపై చిత్తశుద్ధే కరువైందన్నారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరంగల్ నగరాన్ని సమస్యల గుండంగా మార్చారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. అభివృద్ధి పనుల పేరిట గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ నేతలు.. నిధుల కేటాయింపు ఊసే ఎత్త లేదన్నారు. ఇష్టారాజ్యంగా పనులను మంజూరు చేయడం, శంకుస్థాపనలతో ప్రజలను నమ్మించి మళ్లీ అధికారంలోకి వచ్చే కుట్రలకు ఒడిగట్టారన్నారు. కానీ ప్రజలు విశ్వసించకపోవడంతో ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. నాటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నగరాభివృద్ధి, సమస్యలు, పరిష్కార చర్యలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై సమీక్షలు కూడా జరపని దుస్థితంటూ సురేఖ మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

నగరాన్ని అభివృద్ధి చేస్తాం..

గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి సురేఖ వెల్లడించారు. ఇష్టారాజ్యంగా ప్రకటించిన పనులను సమీక్షించి వాటి ఆచరణ, నిధులు, ప్రజల అవసరాలు, నగరాభివృద్ధి ప్రాధాన్య క్రమంలో గుర్తించి పనులు చేపడతామన్నారు. వరంగల్‌ను మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. జీడబ్ల్యూఎంసీ, కుడా పనులతో నగర రూపురేఖలను మారుస్తామన్నారు. నగరాన్ని టూరిస్ట్ హబ్‌గా మార్చడం ద్వారా ఆదాయం, ఉద్యోగావకాశాలు నెలకొంటాయన్నారు. అలాగే నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ తప్పిదాలు నగరానికి శాపంగా పరిణమించాయన్నారు. మురికివాడలోని ప్రజల సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. అమరవీరులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని కలెక్టర్లకు చెప్పినట్లు వివరించారు. వరంగల్‌లో ఇంద్రవెల్లి తరహాలో అమరులను స్మరించే సభను నిర్వహించే ఆలోచనతో ఉన్నట్లు సురేఖ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వరంగల్‌లోని బెస్ టెర్మినల్, స్టేడియం ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం రేవంత్‌రెడ్డిని వరంగల్‌కు తీసుకురానున్నట్లు మంత్రి సురేఖ చెప్పారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్



హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విభజన హామీలు - కేంద్రప్రభుత్వం వివక్షత - దగాపడ్డ వరంగల్ ' అనే అంశంపై నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

ఓరుగల్లు ఒక చారిత్రాత్మకమై పోరుగల్లు అని, చాకలి ఐలమ్మ పోరాట వారసత్వం, బందగీ, కాళోజీ, ఆచార్య జయశంకర్ వరకు కొనసాగిన పోరాట ఘనత ఈ ప్రాంతానిదని అన్నారు. తెలంగాణ ప్రాంతం సుదీర్ఘకాలంగా పాలకుల అణచివేతకు గురైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది త్యాగాలను తన పొత్తిళ్లల్లో నింపుకొని ఎంతో మంది త్యాగనిరతితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కోదండరామ్ అన్నారు. వేలాది మంది పోరాటంతో సాధించుకున్న తెలంగాణను దొరల గడీలకు పరిమితమైతే ఇటీవల జరిగిన ఎన్నికల్లో దొరల గడీల పాలనను ఓటు అనే వజ్రాయుధం ద్వారా పాలకుల గడీలను బద్ధలు కొట్టి ప్రజాస్వామ్య పాలనను ప్రజలు కోరుకున్నారని అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని వెంటనే ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల విభజనను పూర్తి చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కు పంపాలని, పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర స్థాయి సంస్థలు, ఆస్తులను విభజించాలని, కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా తేల్చాలని, రాష్ట్రంలో హార్టికల్చర్ యూనివర్సిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానించారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మరాజన్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ నాయకులు మన్నె బాబురావు, ప్రజాసంఘాల నాయకులు రత్నం కిరణ్, చాప బాబుదొర, జహంగీర్, డోలి సత్యనారా యణ, బొనగాని రవీందర్, గుండు రాంచందర్, వెలిశాల రాజేష్, మనోజ్‌కుమార్, బండి మొగిలి, దుర్గం సారయ్య, అంకేశ్వరపు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలను పునరుద్ధరించాలి

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 3: పుస్తకాలు మెదడుకు పదును పెడుతాయన్న మేధావుల నినాదాలకు సార్థకత కల్పించకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పౌరస్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రధాన కార్యదర్శి నల్లెల్ల రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ కాళోజీ సెంటర్‌లోని ప్రజాకవి కాళోజీ నారాయణరావు విగ్రహం ఎదుట శనివారం వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. వరంగల్ నగర పరిసర ప్రాంత మండలాల్లోని గ్రంథాలయాలు రెండేళ్లుగా మూతపడి శిథిలావస్థకు చేరి నిర్వహణ అధ్వాన్నంగా మారిన అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు.



కాళోజీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పౌర స్పందన వేదిక నాయకులు

ఈ సందర్భంగా పౌరస్పందన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు మాట్లాడుతూ.. ప్రజా కవులుగా పేరొందిన కాళోజీ సోదరుల జన్మస్థలమైన మడికొండ గ్రామంలో 30 ఏళ్ల కిందట ఏర్పడిన గ్రంథాలయం రెండేళ్లుగా మూతపడి గోడలు కూలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గీసుగొండ మండల కేంద్ర గ్రంథాలయం, వరంగల్‌లోని రామన్నపేట గ్రంథాలయం, హనుమకొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థలకు నిర్వహణ కొరవడిందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ సంస్థ మేలుకొని శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలన్నింటిని పునరుద్ధరించి గ్రామాల్లోని విద్యార్థులు పోటీ పరీక్షల మేథో వికాసానికి తోడ్పాటు నందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముగిసిన దరఖాస్తుల ఘట్టం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: రానున్న పార్లమెంట్ ఎన్నికల క్రమంలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఘట్టం ముగిసింది. నాలుగు రోజులుగా హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తుల స్వీకరణ క్రమంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు దరఖాస్తులను సమర్పించారు. శనివారం చివరి రోజు కావడంతో ఈ రెండు స్థానాల నుంచి ఆశావహులు డబుల్ డిజిట్‌లో ఉండడంతో దరఖాస్తుల పరంపర కొనసాగింది. ఇప్పటిఏ వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులతో పాటు ప్రభుత్వ అధికారులు కూడా రాజకీయ ఆరంగ్రేటం కోసం దరఖాస్తు చేసుకున్నారు.



వరంగల్ పార్లమెంట్ స్థానం కోసం దరఖాస్తు అందచేస్తున్న పిడమర్తి రవి

ఢిల్లీకి ఫైనల్ లిస్ట్

దరఖాస్తుల ముగింపుతో ఈనెల 8లోగానే స్ర్కీనింగ్ పూర్తి చేసి ముగ్గురేసి అభ్యర్థులతో కూడిన జాబితాను టీపీసీసీ ఢిల్లీకి పంపనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం అధిష్ఠానం ఎంపిక ప్రకియను చేపట్టి 15 నుంచి 18వ తేదీలోగానే అభ్యర్థుల ఎంపిక పూర్తి ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న కమిషనర్


ఆలయంలో ఆశీర్వచనం అనంతరం కమిషనర్ హన్మంతరావుతో అర్చకులు

మంగపేట, ఫిబ్రవరి 3: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహ స్వామిని శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు దర్శించుకున్నారు. కమిషనర్‌కు ఆలయ సంప్రదాయాల ప్రకారం అర్చకులు, చైర్మన్ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్ స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలకు చీర, సారె సమర్పించారు. ఆలయ అర్చకులు కమిషనర్‌కు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టువస్త్రాలతో సత్కరించారు.కార్యక్రమంలో చైర్మన్ నూతలకంటి ముకుందం, డీఎల్పీవో స్వరూప, దేవస్థానం ఈవో శ్రవణపు సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : ములుగుకు వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కొయ్యడి విజేందర్, ఉపాధ్యక్షుడు నాంపల్లి రాకేష్, నాయకులు ఎ.అశోక్, రాజు, రాహుల్, సంతోష్, నరేష్, తాహెర్‌అలీ, లెనిన్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయలకు దుప్పట్లు, సరుకుల పంపిణీ


గొత్తికోయలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న పైడాకుల అశోక్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 3 : గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లోని జలగలంచ, మొండ్యాలతోగు, కొండపర్తి గూడాల్లోని 100 గొత్తికోయ కుటుంబాలకు పీస్ ఫర్ ఆల్ సెషన్స్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన దుప్పట్లు, నిత్యావసర సరుకులను శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కరోనా సమయంలో మంత్రి సీతక్క ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జిల్లాలోని ప్రతి గ్రామంతో పాటు గొత్తికోయ గూడాలను సందర్శించి ప్రజలకు అండగా ఉంటూ తోచిన సాయం చేశారని అన్నారు. మంత్రి సీతక్క సేవలను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి గొత్తికోయలకు సాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. మున్ముందు పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, సంస్థ సభ్యులు వరదదాసు, బానోతు వెంకన్న, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో అవినీతిని అరికట్టాలి

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి 3 : ఏటూరునాగారంలోని ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నబోయినపల్లిలో సంఘం నాయకుల సమావేశం జరగగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో అర్హతలేని వారికి ఉన్నత పదవి ఇచ్చారని, టెక్నికల్ అసిస్టెంట్లను ఏఈలుగా, ఏఈలను డీఈలుగా, డీఈని ఈఈగా నియమించారన్నారు. గిరిజన గ్రామాల్లో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులు నాసిరకంగా చేపడుతున్నా పర్యవేక్షణ కరువైందన్నారు. బిల్లుల చెల్లింపులు కూడా జరుగుతున్నాయని విమర్శించారు. ఐటీడీఏలోని ఇంజనీరింగ్ శాఖ అవినీతికి ఆనవాలుగా మారిందని, గతంలో జరిగిన ఏసీబీ దాడులే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అవినీతిపై పోరాటం చేస్తామని, త్వరలో ఐటీడీఏ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు రాకేష్‌నాయక్, మహేందర్, గణేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులు మనోధైర్యంతో ఉండాలి

▸▸ అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవంలో జడ్జి మాధవి


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు మనోధైర్యంతో ఉండాలని, సమయానికి మందులు వాడాలని సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి అన్నారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ములుగులోని ఏరియా ఆస్పత్రిలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ అనేది అంటువ్యాధి కాదని, తొలి దశలో గుర్తించకపోతే ఇతర భాగాలకు వ్యాపించి చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టదని అన్నారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఆధునిక జీవనశైలి ప్రధానమైందని, మద్యం, పొగ తాగడం, ఆహార పదార్థాలలో రంగుల వినియోగం, రసాయనాలు వాడడం, అధిక బరువు, కాలుష్యం క్యాన్సర్‌కు దారి తీస్తాయని తెలిపారు. ఈ సదస్సులో అడిషనల్ జూనియర్ జడ్జి జె.సౌఖ్య, వైద్యాధికారి పి.రఘు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.వేణుగోపాలచారి, న్యాయవాదులు మేకల మహేందర్, బి.స్వామిదాసు, రాజుకుమార్, కిషన్‌రావు, చంద్రయ్య, వినయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూలో పలు సంఘాల నేతల చేరిక

టేకుమట్ల, ఫిబ్రవరి 3: ఉపాధ్యాయ సంఘాల నుంచి పలువురు నాయకులు శనివారం పీఆర్‌టీయూలో చేరినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చిరాములు తెలిపారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పేరుకపోయిన ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డిపై నమ్మకంతో వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి పీఆర్‌టీయూలో చేరారన్నారు. దుబ్యాల, రాఘవరెడ్డిపేట, వంగిడిపల్లి ప్రభుత్వ పాఠశాలల నుంచి 9 మంది పీఆర్‌టీయూలో చేరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేష్‌రెడ్డి, కోనేటి దయాకర్, వేణు, సతీష్, జిల్లా నాయకులు చాగంటి ఆనంద్, రఫీ, రాజలక్ష్మి, రవి, తిరుపతి, లింగమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులదే కీలక పాత్ర


పట్టణంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సుభాకర్‌రెడ్డి

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 3 : శాసన మండలి ఎన్నికల్లో ఉపాధ్యాయులదే కీలక పాత్ర ఉంటుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని పలు పాఠశాలలు, హాస్టళ్లలో తిరిగి శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు అధికంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం మూలంగా సమస్యలను పరిష్కారం చేసుకోవడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. కార్యక్రమంలో సోషల్ ఫోరం నాయకులు సతీష్, రాంథాన్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో జాతరను విజయవంతం చేద్దాం

▸▸ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


గోవిందరాజుల ఆలయ ప్రాంగణంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి 3 : కోటికి పైగా భక్తులు వచ్చే మహాజాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం ఏటూరునాగారం మండలంలోని కొండాయిలో మంత్రి సీతక్క పర్యటించారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో గోవిందరాజుల ఆలయానికి చేరుకొని దేవతామూర్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం జాతర కోసం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కొండాయి మీదుగా మేడారం చేరుకునే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్టచర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహాజాతరకు ప్రభుత్వం రూ.105 కోట్లను మంజూరు చేసిందని, మేడారంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. జాతరకు వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకొని సంతోషంగా ఇంటికి వెళ్లే వరకు ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోందన్నారు. కొండాయి- ఊరట్టం మీదుగా మేడారంవెళ్లే ప్రధానరహదారి నిర్మాణానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటామని, అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో చర్చించి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కొండాయిపై ప్రత్యేక దృష్టి

గతేడాది వానాకాలంలో జంపన్నవాగు ఉగ్రరూపంలో సర్వం కోల్పోయిన కొండాయిని అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు. కొండాయిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని, గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాన్ని వేరే సురక్షిత ప్రాంతానికి తరలించడమా? లేక జంపన్నవాగు చుట్టూ కరకట్ట నిర్మించడమా? అనే దానిపై ఇంజనీరింగ్ అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారన్నారు. ముంపు ప్రాంతాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

జంపన్న వాగుపై రోడ్డు పరిశీలన

గతేడాది జంపన్నవాగు ఉధృతికి కూలిపోయిన బ్రిడ్జి వద్ద వాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డును మంత్రి సీతక్క పరిశీలించారు. ఈ రహదారిపై వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. జాతర సమయంలో వర్షం పడినా రహదారికి దెబ్బతినకుండా పటిష్టంగా చేపట్టాలని మంత్రి సూచించారు. జాతర అనంతరం జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఏఎస్పీ సంకీర్త్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తా..

▸▸ నియామక పత్రాల పంపిణీలో మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : ఐసీడీఎస్ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించి అంగన్‌వాడీల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని 92 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తామని, సమ్మె కాలపు వేతనాలు అందజేస్తామని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి, నూతన భవనాల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. రద్దయిన క్యాజువల్ సెలవులను పునరుద్ధరించి వేసవి సెలవులు ఇస్తామని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు మంత్రి సీతక్కను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మిఠాయి అందజేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ప్రేమలత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్న రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సరోజన, సమ్మక్క, నాయకురాళ్లు పద్మారాణి, మోక్షారాణి, భాగ్యలక్ష్మి, ప్రేమకుమారి, సడాలు, సరిత, రమ, బేబీ, దేవమ్మ, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతిభా పాటవ పరీక్ష

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 3: తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం భూపాలపల్లి పట్టణంలో ప్రతిభా పాటవ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించగా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంథాన్ మాట్లాడుతూ విద్యార్థులు సాంఘిక శాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించేలా చేసి సామాజిక స్పృహ కల్పించడంలో భాగంగా ఈ పరీక్ష దోహదం చేస్తుందని తెలిపారు. ఈ పరీక్ష జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీఎంవో కిషన్‌రావు, ఏఎంవో లక్ష్మణ్, ఏసీజీ రవీందర్‌రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి : డీటీఎఫ్

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 3: జాతీయ విద్యా విధానం 2020, నూతన పాఠ్య ప్రణాళిక చట్టం 2023లను రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. శనివారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లారు. అక్కడ నిర్వహించిన మహా ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ విద్యా రంగంలో వ్యాపారీకరణ, కేంద్రీకరణ, మతతత్వం, వివక్ష జరిగే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఈ క్రమంలో విద్యా రంగంలో ప్రవేశపెట్టే నూతన చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఇంకా ఆందోళనలు ఉధృతం అవుతాయని లింగారెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధి హామీ ప్రజా వేదిక

టేకుమట్ల, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలో ఉపాధి హామీ ప్రజా వేదిక శనివారం ప్రారంభం అయింది. జిల్లా అదనపు డీఆర్‌డీవో అవినాష్, జిల్లా అధికారులు హాజరై రికార్డులను పరిశీలించారు. ఆశిరెడ్డిపల్లి, వెల్లంపల్లి, దుబ్యాల, వెంకట్రావుపల్లి, పంగిడిపల్లి, బండపల్లి, పెద్దంపల్లి, బూర్నపల్లి, వెలిశాల గ్రామాలు పూర్తి కాగా, మిగిలిన గ్రామాలను ఆదివారం వరకు పూర్తి చేయనున్నట్లు అదనపు డీఆర్‌డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీ పారదర్శకంగా చేపడుతున్నామని తెలిపారు. 24 గ్రామ పంచాయతీలకు గాను 10 గ్రామాలు పూర్తి అవ్వగా మిగిలిన గ్రామాలను ఆదివారం వరకు పూర్తి చేస్తామన్నారు. రికార్డులలో ఎలాంటి అవకతవకలు ఉన్నా సంబంధిత కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు శ్రీనివాస్, రుబినా, వేణు, ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీడీవో అనిత, ఎంపీవో సురేష్, ఏపీవో మాధవి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

▸▸ భద్రాచలం మాజీ ఎమ్మెల్యే వీరయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వీరయ్య

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 3 : మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే ఓడిపోవడం బాధాకరమని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ చిడెం మోహన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీతాదేవి, అట్టం సత్యవతి, నాయకులు చిడెం శివ, వేణు పాల్గొన్నారు.

ఔషధ నియంత్రణ విభాగం అధికారుల తనిఖీలు

▸▸ రూ.70వేల విలువైన మందులు పట్టివేత


క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న ఏడీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

కాటారం, ఫిబ్రవరి 3:మండల కేంద్రంలో ఔషధ నియంత్రణ తనిఖీ విభాగం అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజ్యలక్ష్మి నేతృత్వంలో భూపాలపల్లి, వరంగల్, జనగామ జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పావని, అరవింద్‌రెడ్డి, బాలకృష్ణలు తనిఖీలు చేశారు. క్లినిక్ నడిపిస్తూ ఎలాంటి లైసెన్స్ లేకుండా భారీ ఎత్తున మందులు విక్రయిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు అరవింద్ ప్రాథమిక చికిత్స కేంద్రంలో తనిఖీలు చేయగా మందులు పట్టుబడినట్లు ఏడీ రాజ్యలక్ష్మి తెలిపారు. తనిఖీల సందర్భంగా సుమారు రూ.70వేల విలువైన మందులు పట్టుబడినట్లు ఆమె వెల్లడించారు. అనుమతి లేకుండా మందులు నిల్వ చేసిన ప్రాథమిక చికిత్స కేంద్రం నిర్వాహకుడిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో ఖచ్చితంగా పూర్తి స్థాయి నిబంధనలు పాటించాలని, కెమిస్ట్, డ్రగిస్టులు సేవా దృక్పథంతో పని చేయాలన్నారు. అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫార్మసిస్టులు ఆప్రాన్ తప్పనిసరిగా వాడాలని, మందులు కొనుగోలు చేసిన వారికి బిల్లులివ్వాలన్నారు. అర్హులైన వారే మందుల విక్రయాలు చేయాలన్నారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్‌లేకుండా మందులు విక్రయించవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

విశ్రాంత ఉద్యోగుల కృషికి దక్కనున్న ఫలితం

కాకతీయఖని, ఫిబ్రవరి 3 : సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలపై గత మూడు, నాలుగేళ్లుగా చేస్తున్న కృషికి త్వరలోనే ఫలితం దక్కబోతుందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ భూపాలపల్లి ఏరియా అధ్యక్షుడు సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్ ఇండియా కోల్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఏఐసీపీఏ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కోల్ పెన్షనర్ల డిమాండ్లను త్వరలోనే కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. అలాగే ఈ నెల 12న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తాము చేపట్టబోయే నిరసన గురించి చర్చించినట్లు చెప్పారు.

జిల్లా పోలీసు కార్యాలయ స్థలాన్ని పరిశీలించిన ఎండీ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 3:ములుగులో నూతన జిల్లా పోలీసు కార్యాలయ స్థలాన్ని పోలీసుహౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేష్‌రెడ్డి శనివారం ఎస్పీ శబరీశ్, అధికారులతో కలిసి సందర్శించారు. సిబ్బందికి, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా జిల్లాలో నూతన పోలీసు కార్యాలయం నిర్మించడానికి తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ గట్టమ్మ దేవాలయం పరిసరాల్లో పోలీస్ శాఖకు కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ శబరీశ్ ప్రాంగణ పరిసరాలను స్వయంగా చూపించి మ్యాప్‌ల ద్వారా ఎండీకి వివరించారు. ఆదేవిధంగా డీపీవో కార్యాలయం, పరేడ్ గ్రౌండ్, సిబ్బంది వసతిగృహాల నిర్మాణ నమూనాలను అధికారులకు వివరించారు. అదనపు ఎస్పీ సదానందం, చీఫ్ ఇంజనీర్ తులసీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో భక్తుల పూజలు

మహదేవపూర్, ఫిబ్రవరి 3 : మండలంలోని కాళేశ్వరంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. శనివారం నవగ్రహ పూజలు నిర్వహించేందుకు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ నెల లోనే మేడారం జాతర ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాళేశ్వరం చేరుకున్నారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన

చిట్యాల, ఫిబ్రవరి 3: మండలంలోని నవాబుపేట గ్రామంలో కుష్ఠు వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ శరీరంలో ఏర్పడే మచ్చలను గుర్తించి స్పర్శ లేకపోతే అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించాలన్నారు. విద్యార్థులు, యువత కుష్ఠు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కుష్ఠు వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుచరిత, ఏఎన్‌ఎం జయలత, ఆశా వర్కర్లు కమల, సరోజన తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు : కుష్ఠు వ్యాధి నివారణలో భాగంగా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. శనివారం మండలంలోని మురుమూరు జీపీలోని ప్రగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, గ్రామస్తులకు కుష్ఠు వ్యాధి నిర్ధారణ, నివారణపై అవగాహన కల్పించారు. డీపీఎం జైరాజు, హెచ్‌ఎస్ కోటిరెడ్డి, స్కూల్ హెచ్‌ఎం వాసం సుదేశ్, అంగన్‌వాడీ టీచర్లు ఝాన్సీ, కళావతి, ఏఎన్‌ఎం కన్యాకుమారి, మాజీ ఉపసర్పంచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారుల ఆందోళన


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

మంగపేట, ఫిబ్రవరి 3 : దళిత బంధు పథకానికి ఎంపికైన తమకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నిధులు ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ లబ్ధిదారులు మంగపేట మండల కేంద్రంలో శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు లబ్ధిదారులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట గంట పాటు ధర్నా చేపట్టారు. ఈక్రమంలో లబ్ధిదారులు పలు నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట నిరసన దీక్షకు దిగారు. ఈ దీక్షాలకు టీ అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ, బీఆర్‌ఎస్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో దళితబంధుపథకాన్ని తెచ్చారన్నారు. అయితే ప్రభుత్వం ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో దళితబంధు నిధులు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలతో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు బసరకాని హరికృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, దళిత సంఘాల జిల్లా, మండల నాయకులు కర్రి శ్యాంబాబు, రాజమల్ల సుకుమార్, చిట్టిమల్ల సమ్మయ్య, మూగల రమేష్, జానపట్ల జయరాజ్, నిమ్మగడ్డ ప్రవీణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించాలి

▸▸ కలెక్టర్ భవేష్ మిశ్రా


మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 3: జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 19 సంవత్సరాల లోపు వారందరికి ఫిబ్రవరి 12న అల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సీడీపీవో, మెప్మా సిబ్బంది పర్యవేక్షణాధికారులుగా విధులు నిర్వర్తించి నులి పురుగుల నివారణ కార్యక్రమంను విజయవంతం చేయాలన్నారు. అల్బెండజోల్ మాత్రల వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని పిల్లలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో మధుసూదన్, డీపీవో ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

గండ్ర జ్యోతి పాదయాత్రలో బీఆర్‌ఎస్ నేతలు


గండ్ర జ్యోతితో కలిసి పాదయాత్ర చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఫిబ్రవరి 3: భూపాలపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి చేపట్టిన పాదయాత్రలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పాల్గొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం మంజూర్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టిన విషయం విదితమే. శనివారంతో ఆపాదయాత్ర 15వ రోజుకు చేరుకుంది. ప్రకాశం జిల్లా కుంభం వరకు చేరుకొన్న ఆమెను బీఆర్‌ఎస్ శ్రేణులు మోతె రాజు, గురిజాల శ్రీనివాస్, మోతె రామకృష్ణ, జిల్లాల తిరుపతితో పాటు పట్టణ బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు మాదాసు తిరుపతమ్మ, వాసాల స్వప్నలు పాల్గొని కొన్ని కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


విష్ణు (ఫైల్)

మహదేవపూర్, ఫిబ్రవరి 3: ఎన్నో ఆశలతో విదేశాల్లో స్థిరపడదామని ఆశపడిన యువకుడు తన ఆశలు అడియాస కావడంతో శనివారం తెల్లవారుజామున జనగామలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే... మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన చల్లా విష్ణు(24) బీటెక్ చదువుకున్నాడు. విదేశాల్లో స్థిరపడేందుకు ప్రయత్నించగా యూఎస్, యూకే వీసాలు రిజెక్ట్ అయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన విష్ణు శనివారం తెల్లవారుజామున జనగామ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కాళేశ్వరంకు తరలించారు. యువకుడి ఆత్మహత్యతో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

▸▸ ఓసీపీ వద్ద మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన


సంఘటన స్థలంలో మృతి చెందిన సాయివినయ్

మల్హర్, ఫిబ్రవరి 3: వాటర్ ట్యాంకర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు శనివారం మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం... మండలంలోని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన అనిపెద్ది లక్ష్మీనారాయణ, అరుణ దంపతులు వ్యవసాయ కూలీపనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సాయివినయ్(20) ఉన్నారు. సాయివినయ్ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. నానమ్మ సంవత్సరీకం ఉండడంతో పెద్దతూండ్ల గ్రామానికి మూడు రోజుల క్రితం వచ్చాడు. ఈ క్రమంలో పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సాయివినయ్, అతని స్నేహితుడు మధుకర్ మండల కేంద్రమైన తాడిచర్లకు వచ్చారు. అక్కడి నుంచి మల్లారంకు వెళ్తుండగా తాడిచర్ల శివారులోని ఎర్రగుంట వద్ద వాటర్ ట్యాంకర్, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాయివినయ్ అక్కడికక్కడే మృతి చెందగా, మధుకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మధుకర్‌ను 108 వాహనంలో భూపాలపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అయితే ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ కాపురంలోని ఓసీపీ క్యాంపు కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలాని సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు నరేష్, సురేష్ పరిశీలించారు. అలాగే డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సివిక్ యాక్షన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

▸▸ సీఆర్పీఎఫ్ కమాండెంట్ ఆర్‌కె.పాండు


సివిక్ యాక్షన్‌ను ప్రారంభిస్తున్న సీఆర్పీఎఫ్ కమాండెంట్ ఆర్‌కె.పాండు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సివిక్ యాక్షన్-2024 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. 39వ బెటాలియన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు యువతి, యువకులకు ఈ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం చేపట్టారు. కాగా, యువతి, యువకులకు డ్రైవింగ్, టైలరింగ్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్, అక్షర సామాజిక సేవ తదితర నైపుణ్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ కమాండెంట్ ఆర్‌కె.పాండు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల రోజుల శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ డీఎస్పీ వృషలి, డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.